## నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలి

- సెల్ కాన్ఫరెన్స్‌లో ప్రత్యేకాధికారి శరత్ ఆదేశం

కంఠేశ్వర్, ఏప్రిల్ 8: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఎక్కడా అంతరాయం ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో నీటి సరఫరా పర్యవేక్షణ తీరుపై సోమవారం సెల్‌కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి శరత్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సరఫరా అంశం అత్యంత కీలకమైందన్నారు. ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తితే అనుమతుల కోసం వేచి చూడకుండా యుద్ధప్రతిపాదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులందరూ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని హితవు పలికారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నీటి సరఫరా సజావుగానే జరుగుతున్నదని, ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే తక్షణమే స్పందించేలా అధికారులు, సిబ్బందిని సిద్ధంగా ఉంచామని అన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపాలిటీల కమిషనర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్, సీపీ

కంఠేశ్వర్, ఏప్రిల్ 8 : జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. క్రోధి నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ శుభాలు చేకూరాలని, భద్రతా భావంతో ఉండాలని ఆకాంక్షించారు. తెలుగు నూతన సంవత్సరం ప్రజలందరికీ జీవితాల్లో ఆనందోత్సాహాలు నింపాలని మనసారా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## విద్యార్థినులకు కంటి పరీక్షలు

వర్ని, ఏప్రిల్ 8 : మండలంలోని పాత వర్ని గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో సోమవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పాఠశాలలోని 215 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించి, 36 మందికి కంటి అద్దాలు అవసరముందని గుర్తించారు. వీరికి ఉచితంగా కంటి అద్దాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి అహసానుల్లా, సిబ్బంది రమేశ్, సుమలత, వసంత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధురి, స్టాఫ్ నర్స్ లిఖిత కుమారి పాల్గొన్నారు.

## మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టాలి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 8 : మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టాలని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, జిల్లా ఇన్‌చార్జి వల్లెపు ఉపేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని బీఎల్ఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించగా వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎలాగైనా అధికారం చేపట్టాలనే అక్కసుతో నోటికి ఏది వస్తే అది, అమలుకు సాధ్యపడని హామీలతో ప్రజలను బురిడీ కొట్టించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. అధికారం చేపట్టి నాలుగు నెలలు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. నాయకులు శ్రీనివాస్, రాజశేఖర్, అంజయ్య, మోసిన్, అనిల్, నర్సయ్య, సంగీత, సామెల్, రవి పాల్గొన్నారు.

# పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

వర్ని మండల కేంద్రంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి మధుసూదన్

బాల్కొండ మండలకేంద్రంలో మాట్లాడుతున్న ఎంఈవో బట్టు రాజేశ్వర్

- ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్లతో అవగాహన
- జూన్ 10లోగా పూర్తిచేయాలని సూచన

బాల్కొండ/ఎడపల్లి/వర్ని/ సిరికొండ/ ధర్పల్లి/ రుద్రూర్, ఏప్రిల్ 8 : జిల్లాలోని వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్లతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను జూన్ 10వ తేదీలోగా పూర్తిచేయాలని సూచించారు. బాల్కొండ మండల కేంద్రంలో ఎంఈవో బట్టు రాజేశ్వర్ సమావేశం నిర్వహించి అమ్మ ఆదర్శ కమిటీలు పాఠశాలల్లో అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. బాల్కొండ, మెండోరా, ముప్కాల్ మండలాల అభివృద్ధి అధికారులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, వనజ, ముజాఫర్, ఏఈలు షర్పూల్, వినీత్, నాగేశ్వర్‌రావు, మహిళా సమాఖ్యల చైర్‌పర్సన్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఎడపల్లిలో ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంఈవో రామారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈజీఎస్ నిధులతో మండలంలోని 24 పాఠశాలలల్లో మరమ్మతు పనులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. వర్ని ఎంపీడీవో సమావేశం హాలులో మండల ప్రత్యేకాధికారి మధుసూదన్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించిందని, కమిటీలు నిధులను వెచ్చించి అభివృద్ధి పనులు చేయించాలని సూచించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. సిరికొండ మండలంలోని కాంప్లెక్స్ హెచ్ఎం సతీశ్ అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ధర్పల్లిలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితులను మెరుగుపర్చాలన్నారు. రుద్రూర్ మండలకేంద్రంలోని సమీకృత భవనంలో ఎంఈవో శాంతకుమారి సమావేశం నిర్వహించారు. మండలంలోని 16 పాఠశాలల్లో డీఎంఎఫ్, ఎస్‌డీఎఫ్ నిధులతో పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలన్నారు. డీఈ రాజేశ్వర్‌రావు, ఎంఈవో శాంతకుమారి, ఎంపీడీవో సురేశ్‌బాబు, ఏపీఎం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్లకు సమావేశం నిర్వహించారు. బోధన్ ఎంఈవో నాగ్‌నాథ్, బోధన్ ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్ మాట్లాడారు. బోధన్‌లో 30 పాఠశాలలు, సాలూర మండలంలోని 10 పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైనట్లు తెలిపారు. ఏఈ సాయిలు, బోధన్ మండల నోడల్ అధికారి నాగయ్య, సాలూరా మండల నోడల్ అధికారి రాజమంజుష ఉన్నారు.

## అనాథ పిల్లలకు రూ. 3 లక్షల చెక్కు అందజేత

చెక్కును అందజేస్తున్న సీనియర్ లీగల్ జడ్జి పద్మావతి

**లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో..**

ఇందల్వాయి, ఏప్రిల్ 8 : మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అనాథ పిల్లలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో విక్టిమ్ కాంపెన్సేషన్ ఆధ్వర్యంలో సోమవారం డబ్బులు అందజేశారు. భర్తను భార్య చంపి యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న నేపథ్యంలో వారి పిల్లలు అనాథలయ్యారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ నిధుల నుంచి పిల్లల భవిష్యత్తు కోసం రూ. 3 లక్షల చెక్కును చిన్నారుల నానమ్మకు న్యాయ సేవా సంస్థ కార్యాలయంలో సీనియర్ లీగల్ జడ్జి పద్మావతి అందజేశారు. సీనియర్ లీగల్ జడ్జితోపాటు అథారిటీ ప్రతినిధులకు సిర్నాపల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు, సూపరింటెండెంట్ పురుషోత్తం, రిటైర్డ్ ఏఎస్సై జీవన్‌రావు, సిర్నాపల్లి మాజీ సర్పంచ్ తేలు విజయ్ పాల్గొన్నారు.

## అలరించిన కవి సమ్మేళనం

కార్యక్రమంలో పాల్గొన్న కవులు, రచయితలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 8 : జిల్లాకేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో హరిదా రచయితల సంఘం, తెలంగాణ రచయితల సంఘం, ఇందూరు యువత సాహిత్య సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉగాది కోకిలల ధూంధాం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి పంచరెడ్డి లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. ప్రతి జీవితం పచ్చని వసంతంలా వర్ధిల్లాలని, ఉగాదిని మించిన విప్లవం లేదని, శిశిరాన్ని వసంతంగా మార్చే ఉగాది మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు. ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ ఉగాది చైతన్యానికి సంకేతమని, కవిత్వం చైతన్య వారథులని కవులు, రచయితలు అనధికార శాసనకర్తలని అన్నారు. నరాల సుధాకర్, మద్దుకూరి సాయిబాబు, తిరుమల శ్రీనివాస్, ఉషాకోయిల సత్యనారాయణ, కంకణాల రాజేశ్వర్, చెన్న శంకర్, చౌడి పద్మావతి, సుజాత, ప్రవీణ్‌కుమార్, పద్మజారెడ్డి, దారం గంగాధర్, సమత, పురం శంకర్ తదితరులు తమ కవితలను వినిపించారు. కవితాగానం చేసిన కవులను ఉగాది పురస్కారాలతో సన్మానించారు.

## మోస్రా జీపీ ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య

ఆర్థిక సహాయం అందజేస్తున్న డీఎల్పీవో సాయిబాబా

మోస్రా (చందూర్), ఏప్రిల్ 8 : మోస్రా జీపీ ట్రాక్టర్ డ్రైవర్ గొల్ల దూపల్లి సాయిలు (48) ఆదివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిలు తన భార్యపై ఉన్న రెండున్నర ఎకరాల భూమిని తనపైకి మార్చాలని మద్యంతాగి వచ్చి ఇంట్లో గొడవ పడేవాడు. ఆదివారం కూడా తన భార్యను కొట్టి, ఇంట్లో నుంచి బయటికి గెంటివేశాడు. అనంతరం ఇంట్లో ఉన్న ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయిలుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని డీఎల్పీవో సాయిబాబా పరామర్శించి, అంత్యక్రియల నిర్వహణ కోసం రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో రఫీ, కార్యదర్శి ప్రేమ్‌కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేత

కోటగిరి, ఏప్రిల్ 8 : మండలకేంద్రంలోని రచ్చగల్లీకి చెందిన భాగిర్తి సావిత్రి భర్త సోమవారం మృతిచెందాడు. బాధిత కుటుంబానికి తెల్ల రవి యువసేన ఆధ్వర్యంలో తేళ్ల రవికుమార్ కులపెద్దలు భీమ సాయిరెడ్డి, సంతోష్‌తో కలిసి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పెద్ద కాపు శ్రీకాంత్, యోగేశ్, హరిప్రీత్ పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల పరిశీలన

డిచ్‌పల్లి, ఏప్రిల్ 8 : మండలంలోని ధర్మారం, నడ్పల్లి, డిచ్‌పల్లి గ్రామాల్లోని ఎరువుల విక్రయ కేంద్రాలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్.. ఏవో శ్రీరాంబాబుతోకలిసి సోమవారం పరిశీలించారు. ఈ-పాస్ మిషన్‌లో ఉన్న ఎరువుల బస్తాల నిల్వలు, భౌతికంగా ఉన్న నిల్వలను ఆన్‌లైన్ వెరిఫికేషన్ చేశారు. ఎరువుల బస్తాలను ఈ-పాస్ మిషన్ ద్వారా మాత్రమే రైతులకు విక్రయించాలని, నేరుగా విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కొనసాగుతున్న గ్రూప్-1 కోచింగ్ తరగతులు

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాధాకృష్ణ చౌహాన్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 8 : టీయూలో కాంపిటేటివ్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీ పరీక్షల అవగాహన తరగతులు కొనసాగుతున్నాయి. రిసోర్స్‌పర్సన్‌గా సంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ రాధాకృష్ణ చౌహాన్, 'ప్రజాస్వామ్యం – భారత రాజ్యాంగం' అంశంపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. హక్కులతో పాటు విధులను భారత రాజ్యాంగంలో చర్చించారన్నారు. కులాలకతీతంగా భారత రాజ్యాంగం తన విశిష్టతను కాపాడుకుంటున్నదన్నారు. తన వంతుగా లైబ్రరీకి పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. రాధాకృష్ణ చౌహాన్‌కు టీయూ రిజిస్ట్రార్ యాదగిరి, కాంపిటేటివ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కేవీ రమణాచారి, కామర్స్ డీన్ ప్రొఫెసర్ రాంబాబు, శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్) కృతజ్ఞతలు తెలిపారు.

## తాగునీటి సమస్యలపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

శక్కర్‌నగర్, ఏప్రిల్ 8: బోధన్ పట్టణంలోని మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్యలపై ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీరు సరఫరాలో ఇబ్బందులు ఉంటే ఫోన్‌చేయాలని ఆయన వివరించారు. జె.మక్కయ్య వాటర్ సప్లయ్ సూపర్‌వైజర్ 9908932817, ఆఫీస్ సబార్డినేట్లు పాషా 9553928580, సాయాగౌడ్ 9963290682 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయాలని సూచించారు.

## రూ.67,200 నగదు పట్టివేత

మాక్లూర్, ఏప్రిల్8: మండలంలోని వేణుకిసాన్‌నగర్ పరిధిలోని శ్రీరాంనగర్‌కు చెందిన భూక్యా లక్ష్మణ్ తన ద్విచక్రవాహనంపై రూ.67,200 నగదును సోమవారం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు. మహిళా సంఘం సభ్యులకు చెందిన డబ్బులను మాక్లూర్ బ్యాంక్‌లో జమచేసేందుకు వెళ్తున్నానని బాధితుడు తెలిపాడని, సరైన ఆధారాలు చూపకపోవడంతో ఎఫ్ఎస్‌టీ అధికారి జైక్రాంతికి అప్పగించమన్నారు. ఆధారాలు చూతే జిల్లా అధికారుల నుంచి డబ్బులు తిరిగి పొందవచ్చని ఎస్సై పేర్కొన్నారు.

## ఎండల తీవ్రతతో అప్రమత్తంగా ఉండాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 8 : ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా లేబర్ ఆఫీసర్, మండల ప్రత్యేకాధికారి యోహన్ అన్నారు. ఎంపీడీవో రవీందర్ ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల, తాగునీరు, ఎండల తీవ్రత, వడగాల్పులు, గ్రామాల్లో పారిశుద్ధ్యం అంశాలపై సోమవారం సమావేశం నిర్వహించారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ ధర్మేందర్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, అన్ని గ్రామాల స్పెషల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాష్ట్రాలను దోచుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది

- బీజేపీ తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 8 : తెలంగాణ, కర్ణాటకలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాలను దోచుకునే ప్రయత్నంలో ఉన్నదని, ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నదని బీజేపీ తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ ఆరోపించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణను కాంగ్రెస్ వాళ్లు తమ ఏటీఎంగా మలుచుకుంటున్నారని అన్నారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, పెద్దోళ్ల గంగారెడ్డి, యెండల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి మండలకేంద్రంలో ముస్లింలకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును సోమవారం ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్, ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ముస్లింలకు ముందుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.
– ధర్పల్లి, ఏప్రిల్ 8

రెంజల్ మండలం నీలా గ్రామ శివారులోని సైలానీ బాబా దర్గాను నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. చాదర్ సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనను దర్గా నిర్వాహకుడు వహిద్‌బాబా సన్మానించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.
– రెంజల్, ఏప్రిల్ 8

## ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు

చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు

భీమ్‌గల్, ఏప్రిల్ 8: స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బస్సు సోమవారం ఉదయం ప్రమాదానికి గురైంది. రహత్‌నగర్, కారేపల్లి గ్రామాల నుంచి విద్యార్థులకు భీమ్‌గల్‌కు తీసుకుస్తుండగా కారేపల్లి గండి – ఘాట్ రోడ్డు సెక్షన్‌లో బస్సు స్టీరింగ్ ఫెయిల్ అయ్యింది. బస్సు అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. స్కూల్ బస్సు ప్రమాదంపై మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్థానిక నాయకులతో మాట్లాడారు. తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని కోరారు.

## అకాల వర్షానికి తడిసిన ధాన్యం

భీమ్‌గల్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న యువకులు

భీమ్‌గల్, ఏప్రిల్ 8: మండలంలో ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం అకాల వర్షం కురవడంతో కల్లల్లో ఉన్న ధాన్యం తడిసింది. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

బోధన్ పట్టణంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ తదితరులు హాజరయ్యారు. బోధన్ పట్టణంలోని అప్పా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పి.జీవన్ రెడ్డి పాల్గొన్నారు. – బోధన్, ఏప్రిల్ 8

ఏర్గట్ల మండలంలోని తడ్‌పాకల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం బాల కవి సమ్మేళనం నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకొని విద్యార్థులు కవితలు చదివి వినిపించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. –ఏర్గట్ల, ఏప్రిల్ 8

# గోదావరి ఒడ్డు నుంచి నల్లమట్టి తరలింపు

- టెండర్లు వేసి అక్రమ దందాకు అనుమతించిన వీడీసీలు
- అతివేగంతో ప్రమాదాలు
- టిప్పర్లను అడ్డుకున్న చౌడమ్మ కొండూర్ గ్రామస్తులు

నందిపేట్, ఏప్రిల్ 8 : మండలంలోని ఉమ్మెడ, చౌడమ్మ కొండూర్, డొంకేశ్వర్ మండలం అన్నారం, సిర్‌పూర్ శివారులోని గోదావరి ఒడ్డున పెద్దపెద్ద జేసీబీలతో మట్టిని తవ్వుతున్నారు. ఇక్కడి నుంచి టిప్పర్ల ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. సంబంధిత అధకారులు, పోలీసులకు వ్యాపారులు ముడుపులు అందజేసి మట్టిని తరలిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

**టెండర్ల ద్వారా వీడీసీలకు డబ్బులు**

నల్లమట్టిని తవ్వుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అవేవీ పట్టించుకోకుండా గోదావరి శివారు గ్రామాల గ్రామాభివృద్ధి కమిటీలు (వీడీసీలు) బహిరంగ వేలం నిర్వహించి అక్రమ తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నాయి. డొంకేశ్వర్ మండలంలోని ఓ గ్రామంలో ఓవ్యాపారి రూ.8 లక్షల 52 వేలకు టెండర్ దక్కించుకున్నాడు. మరో గ్రామంలో రూ.2 లక్షలకుపైగా నందిపేట్ మండలంలోని రెండు గ్రామాల్లో రూ. 2 లక్షలకు వేలం వేసినట్లు తెలిసింది.

**అతివేగంతో తరుచూ ప్రమాదాలు**

ఉమ్మెడ శివారులోని గోదావరి ఒడ్డు నుంచి నల్లమట్టితో రోజూ వందలాది టిప్పర్లు అతి వేగంగా వెళ్తున్నాయి. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం అతివేగంగా వెళ్తున్న టిప్పర్ నందిపేట్ నుంచి చౌడమ్మ కొండూర్ వెళ్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై వెనక కూర్చున్న చౌడమ్మ కొండూర్ గ్రామానికి చెందిన మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కోమాలోకి వెళ్లి ప్రస్తుతం చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. నాలుగైదు రోజుల క్రితం టిప్పర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలై దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.

**అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల నిరసన**

నల్లమట్టి తరలిస్తున్న టిప్పర్లు అతివేగంగా వెళ్లడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదంటూ చౌడమ్మ కొండూర్ గ్రామస్తులు సోమవారం లోకేశ్వరం–నందిపేట్ ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేశారు. టిప్పర్లను అడ్డుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.

రాస్తారోకో చేస్తున్న చౌడమ్మ కొండూర్ గ్రామస్తులు

## స్థలాన్ని కాపాడాలంటూ వంటావార్పు

గ్రామపంచాయతీ ఎదుట వంటావార్పు చేస్తున్న కాలనీవాసులు

బాల్కొండ, ఏప్రిల్ 8: మండల కేంద్రంలోని భవానీనగర్‌లో కబ్జాకు గురైన జీపీ స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు సోమవారం జీపీ కార్యాలయం ఎదుట వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఆస్థలంలో పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి కొందరు నిర్మాణం చేపడుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు చేరుకొని సముదాయించి ఆందోళన విరమింపజేశారు. సమస్య ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పల్లె చెరువులో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పూడికతీత పనులను సోమవారం ఎంపీడీవో రాజాశ్రీనివాస్ పరిశీలించారు. కూలీల హాజరు, వారి సంఖ్యను పరిశీలించారు. అనంతరం హాసాకొత్తూర్‌లో తాగునీటి సరఫరాను పరిశీలించారు. – కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 8

## చదువు అర్థం కావడం లేదని.. విద్యార్థి ఆత్మహత్య

సూర్య(ఫైల్)

నవీపేట, ఏప్రిల్ 8: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి ఉన్నత చదువుల కోసం ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్న ఓ విద్యార్థి సోమవారం తన తండ్రి పుట్టిన రోజే యంచ గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఏఎస్సై మోహన్‌రెడ్డి, కుటుంబీకుల కథనం ప్రకారం.. నాగేపూర్‌కు చెందిన పులి శ్రీనివాస్, లావణ్య దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సూర్య(18) జిల్లా కేంద్రంలోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాశాడు. తల్లిదండ్రుల కోరిక మేరకు అదే కళాశాలలో ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈనెల 7న స్వగ్రామానికి వచ్చిన సూర్య తనకు చదువు అర్థం కావడం లేదని తల్లిదండ్రులకు చెప్పాడు. సోమవారం తాను కిరాణా షాపునకు వెళ్లి వస్తానంటూ బైక్ తీసుకొని వెళ్లాడు. యంచ గోదావరి వంతెనపై నుంచి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

## చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

రెంజల్, ఏప్రిల్ 8: గంగపుత్రుడు చేపల వేటకోసం చెరువులో దిగి ఆయన వేసిన వలలోనే చిక్కుకొని మృతిచెందిన సంఘటన దూపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయన్న కథనం ప్రకారం..గ్రామానికి చెందిన గంగపుత్రుడు బొత్త చిన్న లక్ష్మయ్య (65)చేపలను వేటకు చెరువులో తెప్ప సహాయంతో దిగాడు. గాలికి వచ్చిన అలల కారణంగా తెప్ప బోల్తాపడింది. దీంతో చేపల వేట కోసం ఆయన వేసిన వలలోనే చిక్కుకొని మృతి చెందాడు. చిన్న లక్ష్మయ్య కొడుకు భూమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవాన్ని పంచనామా నిర్వహించి, శవ పరీక్ష నిమిత్తం బోధన్ ప్రభుత్వ దవాఖానాకు తరలించినట్లు ఎస్సై ఈ.సాయన్న తెలిపారు.

## సంక్షిప్తంగా..

- **శ్రేష్ఠ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ** - రుద్రూర్, ఏప్రిల్ 8 : మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో శ్రేష్ఠ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ స్థాపించి సమాజసేవ చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు దేగాం శివశంకర్ అన్నారు. సభ్యులు దేగాం మనోజ్, సోంపూర్ పోచీరాం, నగేశ్, రాజు, వెంకట్ పాల్గొన్నారు.
- **బిల్ కలెక్టర్లకు సన్మానం**- ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్8: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్లను సోమవారం కమిషనర్ రాజు సన్మానించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్నులను వసూలు చేసినందుకు సన్మానించినట్లు తెలిపారు.
- **చలివేంద్రాల ప్రారంభం**- ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్8: పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఆర్మూర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను కమిషనర్ రాజు సిబ్బందితో కలిసి సోమవారం ప్రారంభించారు.
- **కార్యవర్గం ఎన్నిక** –భీమ్‌గల్, ఏప్రిల్ 8: మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిచ్చమొల్ల శేఖర్, కార్యదర్శిగా బాలు, సెక్రటరీగా రజినికుమార్‌ను ఎన్నుకున్నారు.
- **నీటి సమస్యలు రాకుండా చూడాలి**- మోర్తాడ్, ఏప్రిల్ 8: గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చూడాలని ఎంపీడీవో తిరుమల కార్యదర్శులకు సూచించారు. వడ్యాట్ గ్రామంలో సోమవారం తాగునీటి ట్యాంకులు, పైప్‌లైన్లు, నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి గణేశ్ ఉన్నారు.
- **రైతులు జాగ్రతలు తీసుకోవాలి**- బోధన్ రూరల్, ఏప్రిల్8: వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, ధాన్యం తడవకుండా రైతులు జాగ్రతలు తీసుకోవాలని బోధన్ ఇన్‌చార్జి ఏడీఏ సంతోష్‌నాయక్ అన్నారు. సోమవారం కల్దుర్కి, పెగడాపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. రైతులతో మాట్లాడారు. ఆయన వెంట ఏఈవోలు ఉన్నారు.
- **పేకాట స్థావరంపై దాడి**- ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్8: మామిడిపల్లి శివారులోని పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి నిర్వహించారు. పేకాడుతున్న ఐదుగురిని అదుపులో తీసుకొని వారి నుంచి సుమారు రూ.పదివేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు.
- **పాఠశాలల్లో ఉగాది వేడుకలు** - కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 8 : మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు ఉగాది పండుగపై అవగాహన కల్పించారు. ఉగాది పచ్చడి తయారుచేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.